సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023

సీఎంను కలిసిన ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని: సీఎం కేసీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం ప్రగతిభవన్‌లో కలిశారు. టికెట్ కేటాయించడంపై పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.



అంధులకు చూపునిద్దాం

మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతున్నవారెందరో కంటి చూపు కోసం ఎదురుచూస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీజేపీ నాయకుల సంబరాలు



బైక్ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జ్యోతినగర్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణులు గురువారం సంబరాలు చేసుకున్నారు. మల్కాపూర్ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. మేడిపల్లి సెంటర్‌లో టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, నియోజకవర్గ కన్వీనర్ పిడుగు కృష్ణ, మల్కాపూర్ మండల ప్రధాన కార్యదర్శి ఈదునూరి చిరంజీవి, సీనియర్ మాదరవేన సమ్మయ్య, జూపూడి అమరేశ్వరరావు, పల్లికొండ నర్సింగ్, జూల విజయ్, సాగి కిషన్ రావు, దబ్బెట కమలాకర్, అంజనేయులుతో పాటు, హిందూవాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రమాణాలు పాటించాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో స్వచ్ఛసర్వేక్షణ్ ప్రమాణాలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. మండలంగర్రెపల్లిలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, చెత్త సేకరణ పరిశీలించారు. స్కూళ్లు, ఆసుపత్రి తనిఖీ చేశారు. సర్పంచ్ వీరగోని సుజాత, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఎంపీడీఓ శశికళ, ఎంపీటీసీ పులి అనూష, ఎంపీఓ ఫయాజ్ అలీ ఉన్నారు.

'గాంధీ' సినిమా 19,894 మంది చూశారు

పెద్దపల్లిరూరల్: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా జిల్లాలోని ఏడు సినిమా థియేటర్లలో గాంధీ సినిమాను ఉచితంగా ప్రదర్శించగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన 19,894 మంది విద్యార్థులు వీక్షించారని డీఈవో మాధవి తెలిపారు. ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు 56 సార్లు ప్రదర్శించినట్లు తెలిపారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు 31 గడువు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థుల్లో అర్హులు ఈ నెలాఖరులోగా పోస్ట్ మెట్రిక్ (రెన్యూవల్ /ఫ్రెష్) స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి కోరారు. విద్యార్థులంతా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు సూచించారు.

ఇస్రో శాస్త్రవేత్తకు దత్తన్న అభినందనలు

జ్యోతినగర్: చంద్రయాన్–3 విజయవంతంలో పనిచేసిన గోదావరిఖనికి చెందిన వెంకట్ కార్తీక్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో అభినందించినట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి కైలాసనాగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయం శాస్త్రీయ పరాక్రమానికి, తిరుగులేని సంకల్పానికి నిదర్శనమని అభివర్ణించారు.

'లక్ష'ణంగా వసూలు..!

- ఫైనలిచ్చిన వారికే బీసీబంధు
- నేతల అనుచరులే దళారులు
- రూ.లక్షకు రూ.10వేల కమీషన్
- బీసీలకు ఆర్థికసాయంలో వింతలు



జిల్లాలోని ఓ ఎమ్మెల్యే చుట్టూ నిత్యం తిరిగే ఓ ఎంపీపీ భర్త ప్రభుత్వం బీసీల్లోని కులవృత్తులకు అందించే రూ.లక్ష సాయం ఇప్పిస్తానంటూ ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు కమీషన్ తీసుకున్నట్లు సమాచారం. సాయానికి ఎంపికైన ఓ లబ్ధిదారుడు కమీషన్ ఇవ్వకపోవడంతో అతడి చెక్కు పంపిణీ కాకుండా అడ్డుకోవడంతో అతడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. చెక్కు ఇచ్చాడన్న ఆరోపణలు వస్తున్నాయి.

రామగుండం కార్పొరేషన్ పరిధిలో రూ.లక్ష సాయానికి అర్హుల జాబితాలో ఏకంగా కార్పొరేటర్ భర్త పేరు ఉండటం చర్చనీయాంశంగా మారింది. గతంలో రామగుండం పరిధిలో కొంత మంది కార్పొరేటర్లు వారి బంధువులకే దళితబంధు ఇప్పించుకున్నారనే విమర్శలున్నాయి. తాజాగా ఈ లక్ష రూపాయల సాయంలోనూ బంధువులు, లేదా కమీషన్ ఇచ్చినవారికే ఇప్పిస్తామంటూ చెబుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: ఈ ఏడాది చివరన అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో అన్ని వర్గాల ఓట్లను ఆకర్షించేందుకు అధికార పార్టీ కొత్త పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా కుల, చేతివృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపి వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ‹బీసీబంధు› పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వచ్చే రూ.లక్ష సాయంతో ఆయా కులవృత్తుల కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం యోచించింది. అయితే క్షేత్రస్థాయిలో తొలివిడత సాయం పంపిణీలో నేతల అనుచరుల కమీషన్లతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడ్డాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హుల జాబితాలో పేరు ఉన్నా.. కమీషన్ ఇవ్వనిదే చెక్కు ఇవ్వని పరిస్థితి నియోజకవర్గాల్లో నెలకొందని సాయం పొందినవారే ఆరోపిస్తున్నారు. మలివిడతలోనైనా కమీషన్లు, నేతల సిఫారసులు లేకుండా పూర్తి సాయం అందేలా చూడాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.10వేలు ఇవ్వాల్సిందే..

విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, రజక, శాలివాహన, కుమ్మరి, మేదరి తదితర 14 కులాలు, ఎంబీసీ కులాల వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు జూన్ 6నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుదారులకు తెల్లరేషన్‌కార్డు, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ పరిధిలో రూ.2లక్షలు ఉండాలనేది నిబంధన. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నిబంధనలకు లోబడి ఉన్న వారిని గుర్తించాలి. ఇలా జిల్లాలో మొత్తం 10,759మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 9,765 మందిని క్షేత్రస్థాయిలో పరిశీలించి 8,683 మందిని అర్హులుగా తేల్చారు. అందులో తొలివిడుతలో భాగంగా పెద్దపల్లి, రామగుండంలో 300 మందికి, మంథనిలో 180, ధర్మారంలో 65 మందిని తొలివిడత ఎంపిక చేశారు. అయితే తొలివిడతలోనే తమ అనుచరులకు చోటుకల్పించాలనే ఆలోచనతో నేతలు, వారి అనుచరుల సిఫారసుకు అధికారులు అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఇదే అదునుగా తమ బంధువులు, అనుచరులు, లేదా రూ.10నుంచి 15వేలు కమీషన్ ఇచ్చిన వారికే తొలివిడతలో చోటు కల్పించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థికంగా లేనివారి పేర్ల స్థానంలో ఆర్థికంగా బాగున్న వారి పేర్లతో జాబితా ఉండటంపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి వివరణ కోరగా నిబంధనల మేరకే.. మంత్రి ఆమోదంతోనే ఎంపికచేశామని తెలిపారు. దళారులకు డబ్బులు ఇవ్వద్దొని, అడిగితే ఫిర్యాదు చేయాలని సూచించారు.

మంథని మనమే గెలువాలె..!

- అభివృద్ధి నేను చూసుకుంటా
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో సీఎం



సీఎం కేసీఆర్ కలిసిన పుట్ట మధు, ఇతర నాయకులు

మంథని: సర్వేలన్నీ నీకే అనుకూలంగా ఉన్నయ్.. అందుకే నీపై కుట్రలు. ప్రతిపక్షాలను పట్టించుకోకుండా ప్రజాబలంతో ముందుకెళ్లు.. విజయం నీదే.. నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేసే బాధ్యత నేను చూసుకుంటా.. అని సీఎం కేసీఆర్ మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు ధైర్యం చెప్పారు. గురువారం తనను వ్యక్తిగతంగా కలవాలన్న సీఎం సూచన మేరకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కలిశారు. ముందుగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితిపై చర్చించారు. గతంలోనే మంథని చేజారిందని, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాల్సిందేనని మధుకు సూచించారు. నియోజకవర్గంలోని పెండింగ్ పనులను మధు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా 40వేల ఎకరాలకుపైగా మేలు చేసే పోతారం ఎత్తిపోతలు మంజూరు చేయాలని కోరారు. రూ.200కోట్ల అంచనాలతో కూడిన ప్రతిపాదనల ప్రతులను సీఎం ముందుంచారు. చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి కోసం తక్షణం రూ.వంద కోట్లు కేటాయించాలని, పెద్దపల్లి–కాటారం ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధికి రూ.120 కోట్లు అవసరముందని, కాటారం కేంద్రంగా మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం శుక్రవారం సచివాలయానికి రావాలని సూచించినట్లు మధు తెలిపారు. మధు వెంట నాయకులు పీట్ల గోపాల్, ఇనుగంటి రామారావు, ఐలి భాస్కర్, తదితరులు ఉన్నారు.

బల్దియాలో వెయ్యి మొక్కలు నాటుతాం

- ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్



కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఈనెల 26న వెయ్యికిపైగా ఎత్తైన మొక్కలు నాటనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ ఏర్పాట్లను పరిశీలించారు. వజ్రోత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా వెయ్యి మొక్కలు నాటుతామన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని ఆనంద కేంద్రం పరిసరాల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కమిషనర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, బల్దియా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుచరణ్, ఏఈ తేజస్విని, హరితహారం ఇన్‌చార్జి అధికారి అర్జున్ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: విద్యావంతులు, యువకులు రాజకీయాల్లోకి రావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆయనకు బీఆర్ఎస్ నుంచి టికెట్ రావడంపై మండలానికి చెందిన పలువురు యువకులు శుభాకాంక్షలు తెలిపారు. యువతతోనే రాజకీయాల్లో మార్పు సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని కోరారు.

సంక్షేమం చూసి పార్టీలో చేరికలు

కాల్వశ్రీరాంపూర్: బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు నచ్చి ప్రజలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దాసరి అన్నారు. మండలంలోని పెద్దరాతుపల్లికి చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం నల్లపోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ దేవయ్య, పార్టీ మండల కన్వీనర్ గొడ్డు రాజకొమురయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని దాసరి సూచించారు. స్థానిక వేదవ్యాస హైస్కూల్ విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ కాల్వ లీలావతిరాంచంద్రారెడ్డి నిలయం నుంచి బస్టాండ్‌చౌరస్తా వరకు చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

సిమ్స్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు

- జాతీయస్థాయిలో 12 మంది, రాష్ట్రం నుంచి 8 మంది చేరిక
- కళాశాల ఆవరణలో సిద్ధమవుతున్న స్టూడెంట్ హాస్టళ్లు



అడ్మిషన్ కోసం వచ్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. 2023–24 విద్యాసంవత్సరానికిగాను ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 150 మంది విద్యార్థులు చేరనున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సిమ్స్ అధికారులు గురువారం చేపట్టారు. ఆల్ ఇండియా కోటాలో 12 మంది, స్టేట్ కోటాలో 8 మంది సిమ్స్‌లో చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఎనిమిది మంది విద్యార్థులు ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్‌ను సంప్రదించగా.. వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌తో కలిసి అభినందించారు.

జాతీయ స్థాయిలో 22 మంది విద్యార్థులు

ఈ విద్యా సంవత్సరంలో సిమ్స్‌లో 150 సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల నీట్ ద్వారా ఓపెన్ ఫర్ ఆల్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. జాతీయస్థాయి కౌన్సెలింగ్ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన 22 మంది విద్యార్థులను సిమ్స్‌కు కేటాయించినట్లు మెయిల్ ద్వారా సమాచారం వచ్చింది. ఇప్పటివరకు 12 మంది రాజస్థాన్, బిహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల వారు ఉన్నారు. మిగిలిన 128 మంది స్టేట్ జాబితాను కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనుంది. శనివారం వరకు కౌన్సెలింగ్‌కు గడువు ఉండడంతో విద్యార్థులు నచ్చిన కళాశాలను ఎంచుకోవడానికి వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల ఆవరణలోనే ప్రొఫెసర్లకు క్వార్టర్లతోపాటు విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు.

మేధాశక్తిని వెలికితీసే చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్



మాట్లాడుతున్న డీఈఓ మాధవి

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల్లోని నైపుణ్యం, సృజనాత్మకశక్తి ఆధారంగా అద్భుతమైన ఆవిష్కరణలు చేసేందుకు చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ దోహదపడుతుందని డీఈవో మాధవి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. అక్టోబర్‌లో నిర్వహించే జిల్లాస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే అంశాన్ని జిల్లా రిసోర్స్ పర్సన్ అంజన్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి వివరించారు. సెక్టోరియల్ అధికారి షేక్, అకడమిక్ కో–ఆర్డినేటర్ నరేశ్, రవినందన్‌రావు తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు సదస్సులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి

రామగిరి: త్రీడీ ప్రింటింగ్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు సదస్సులు దోహదం చేస్తాయని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అన్నారు. త్రీడీ ప్రింటింగ్‌లో జాతీయస్థాయి సాంకేతిక అవగాహన సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కంప్యూటర్ ద్వారా డిజైన్ చేసిన లేయర్ బైలేయర్‌తో కార్డులు, బిల్డింగ్‌లు తక్కువ ఖర్చుతో తయారుచేయడానికి త్రీడీ ప్రింటింగ్ దోహదం చేస్తుందని, గరుడ కంపెనీ సహకారంతో రూ.300 ఖర్చుతో వీటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీపై సివిల్, మెకానికల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కన్వీనర్ ఆర్.దుర్గారావు, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, ఫ్యాకల్టీ సలహాదారు పి.స్వప్న, స్టూడెంట్ కో–ఆర్డినేటర్లు ఎస్.అఖిల్‌తేజ, ఎం.మౌనిక, బి.ఉదయతేజ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలందించాలి

- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్
- తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

పాలకుర్తి: అర్జీలతో వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలందించాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పెండింగ్ దరఖాస్తులు లేకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఆర్ఐ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలపై ప్రచారం చేద్దాం



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాల్లో గురువారం జరిగిన బూత్‌స్థాయి సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లిపై కాషాయజెండా ఎగిరేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. నాయకులు సమ్మయ్య, పల్లె సదానందం, పిన్నింటి రాజు, ఠాకూర్ రాంసింగ్, ఓదెలు, కుమార్, శ్రీనివాస్, సతీశ్, కొండల్, శ్రీనివాస్, రాజు, వెంకటేశ్, రాజయ్య, రామకృష్ణ, సాయన్న పాల్గొన్నారు.







రాఖీ.. 'పెద్దపల్లి'



అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. అలాంటి వేడుకను ఘనంగా నిర్వహించుకోవాలంటే రాఖీ తప్పనిసరి. ఈ రాఖీలకు పెద్దపల్లి కేంద్రంగా మారింది. ఇక్కడ తయారైన రాఖీలను పొరుగు రాష్ట్రాలతోపాటు విదేశాలకూ ఎగుమతి చేస్తుంటారు. తక్కువ ధరలకు.. నాణ్యమైన రాఖీలు లభిస్తుండడంతో అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, లండన్ ఇలా విదేశాల్లో స్థిరపడిన మన రాష్ట్రవాసులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఉప్పు కృష్ణమూర్తి ఎస్ఆర్ఆర్ రాఖీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విక్రయిస్తుండడంతో రిటేల్ వ్యాపారులు కొనుగోలులో ఇలా బిజీగా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

పెద్దంపేటలో భూ సేకరణ సర్వే



యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలంలోని పెదంపేటలో ఆర్జీ–2 సింగరేణి, రెవెన్యూ అధికారులు గురువారం భూ సేకరణ సర్వే నిర్వహించారు. ఓసీపీ–3 విస్తరణలో భాగంగా గ్రామంలో మిగిలిన ఎకరం 12 గుంటల భూమి సేకరించేందుకు గ్రామస్తులతో మాట్లాడి, వారి అభిప్రాయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో భూసేకరణ అధికారి జయశ్రీ, తహసీల్దార్ తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ నిహారిక, సర్వేయర్ డీఐ గణపతి, ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం సలీం, ఎస్టేట్ అధికారి సురేష్‌బాబు, సింగరేణి సర్వేయర్ భాస్కర్, సర్పంచ్ చింతపట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏఈవోలకు గాయాలు

ముత్తారం: మండలంలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు మౌనిక, శ్రీలేఖలు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సల్పంగా గాయపడ్డారు. రామగిరి మండలంలోని బేగంపేట నుంచి ముత్తారానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పడంతో కిందపడ్డారని స్థానికులు తెలిపారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణం ప్రగతినగర్‌లోకి గురువారం వచ్చిన ఓ నెమలి ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి, విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికంగా ఓ ఇంటిపైకి వెళ్లడంతో ప్రమాదం జరిగిందని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

అంధులకు చూపునిద్దాం



- చనిపోయినా నేత్రదానంతో కళ్లను సజీవంగా ఉంచొచ్చు
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్రదాతలు 900 మంది
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



నేత్రాలను సేకరిస్తున్న టెక్నీషియన్ (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతున్నవారెందరో కంటిచూపు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై ఏటా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వాలు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. చనిపోయిన తర్వాత నేత్రాలు భూమిలో కలిసిపోకుండా.. మంటల్లో కాలిబూడిదవకుండా ఉండేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్(94927 81306), లయన్స్ క్లబ్(98491 06589), తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం(73969 24667) తదతర స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో 900 మంది నేత్రదానం చేసి, 1,800 మందికి చూపునిచ్చారు. నేత్రదానానికి 60 వేల మందికి పైగా ప్రతిజ్ఞ చేయగా ఇప్పటివరకు 1,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రదానం ఎవరైనా చేయవచ్చు

నేత్రదానం చేయడానికి వయసు పరిమితులు లేవు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాల(కేటరాక్టు) ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా చేయవచ్చు. హైపటైటిస్, ఎయిడ్స్ తదితర వ్యాధులున్నవారు మాత్రం చేయకూడదు. కళ్లను దానం చేయడానికి స్వచ్ఛంద సంస్థలకు, ఐ బ్యాంకులకు సమాచారం ఇవ్వాలి.

కొన్ని సందర్భాల్లో నలుగురికి చూపునివ్వొచ్చు

మనం మరణించినా.. మన నేత్రాలు మాత్రం సజీవంగానే ఉండాలంటే నేత్రదానం ఒక్కటే మార్గం. కళ్లను తీసిన తర్వాత ఐ బ్యాంకులో విశ్లేషించి, ప్రాసెస్ చేస్తారు. కార్నియాను 96 గంటల్లోపు ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. ఒకరు దానం చేసిన రెండు నేత్రాలతో కొన్ని సందర్భాల్లో నలుగురికి కంటిచూపు ప్రసాదించే అవకాశం ఉంటుంది. మిగతా సాధారణ సందర్భాల్లో మాత్రం ఇద్దరికి చూపు వచ్చేలా చేయొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మరణించిన కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కళ్లతో నలుగురు అంధులకు చూపునిచ్చారు.

ఇవి పాటించడం తప్పనిసరి

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్ గానీ, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి, రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే మృతదేహం దగ్గర ఫ్యాన్లు ఆపేయాలి. ఏసీ, కూలర్లు ఉంటే ఆన్ చేయాలి. తడిపిన దూదిని ఐస్‌తోపాటు మూసిన కళ్లపై ఉంచాలి. తలకింద తలగడ పెట్టి ఎత్తుగా ఉండేలా చూడాలి.

మా అమ్మ కళ్లు దానం చేశాం



మా అమ్మ మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కళ్లను దానం చేశాం. అవి మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఉండి, ఈ లోకాన్ని చూస్తున్నాయని ఆనందంగా ఉంది. నేను కూడా నేత్రదానం చేస్తానని అంగీకారపత్రం ఇచ్చాను.

– కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ మేయర్, రామగుండం

నేత్రదానంతో చూపు సజీవం



మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని చూడొచ్చు. మనిషి మరణించాక నేత్రదానం చేయండి. దీనివల్ల చూపు సజీవంగా ఉంటుంది. ఇంతకంటే గొప్ప దానం మరొకటి లేదు. అపోహలు వీడి, అందరూ ముందుకు రావాలి.

– శ్యాంప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

12 మంది నుంచి సేకరించాం



రామగుండం లయన్స్ ఆధ్వర్యంలో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మరణించిన 12 మంది కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ చేసి, నేత్రాలు సేకరించాం. దీనివల్ల 24 మందికి కంటి చూపు వచ్చేలా చేశాం.

– తానిపర్తి విజయలక్ష్మి, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నేత్రదానంపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను అక్కడి ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని, అవయవాలను ఇతరులకు అమర్చేలా చూస్తున్నాయి. మా ఫౌండేషన్ ద్వారా 900 మంది మృతుల నుంచి కళ్లు సేకరించాం. సెలబ్రిటీలు సమాజహితం కోసం ముందుకు రావాలి.

– సీహెచ్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

బీసీలపై రాజకీయ పార్టీల వైఖరి మారాలి

- జీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి



పూలే విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: బీసీలపై రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని, ఈ వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తామని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి, వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్. ఆనంద్ మాట్లాడుతూ.. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ కేవలం 23 సీట్లు, అర శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు 60 సీట్లు, ముఖ్యమంత్రి పదవిని కేటాయించే పార్టీలకు తమ సంఘం తరపున మద్దతు తెలుపుతామని అన్నారు. సెప్టెంబర్ 10న సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న సింహగర్జన సన్నాహక సమావేశం ఉంటుందని, బీసీ సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అధికార ప్రతినిధి దుంపట మురళి, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ వాసు, గొడిశెల రమేశ్, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

బసంత్‌నగర్ వద్ద గంజాయి విక్రేత అరెస్టు

- వైజాగ్ నుంచి తీసుకొస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- 6.4 కిలోల గంజాయి స్వాధీనం



గోదావరిఖని: గంజాయి విక్రేతను రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యైటింక్లయిన్‌కాలనీ అల్లూరుకు చెందిన బాదె వినయ్‌కుమార్ గురువారం కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బస్సులో వస్తున్నాడు. బసంత్‌నగర్ ఫ్యాక్టరీ గేట్ బస్టాప్ వద్ద పోలీసులు బస్సును ఆపి, తనిఖీలు చేపట్టారు. వినయ్‌కుమార్ వద్ద 6.4 కిలోల గంజాయి లభించింది. దీని విలువ రూ.1.60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా గంజాయికి బానిసై, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న దురాశతో ఈ వ్యాపారం చేస్తున్నట్లు చెప్పాడన్నారు. వైజాగ్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతంలోని అమాయక విద్యార్థులు, యువతకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడిని, గంజాయిని బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

జూలపల్లి: తండ్రిని కిరాతకంగా హతమార్చిన ఓ తనయుడికి పెద్దపల్లి న్యాయస్థానం జీవితఖైదుతోపాటు రూ.1,000 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లి మండలంలోని అబ్బాపూర్‌కు చెందిన కత్తెర్ల మహేశ్ డిగ్రీ ఫెయిలయ్యి, పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో 7–5–2021 రోజున అతని తండ్రి లచ్చయ్య మందలించాడు. తన మిత్రులు, చుట్టుపక్కనున్నవారి ముందు ఇలా చేయడాన్ని మహేశ్ అవమానంగా భావించాడు. అదేరోజు రాత్రి ఆరుబయట తండి మంచం పక్కనే మరో మంచం వేసుకొని, నిద్రించాడు. అర్ధరాత్రి లేచి, పక్కనున్న రోకలి బండతో లచ్చయ్యపై దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేయగా సీఐ ఇంద్రసేనారెడ్డి దర్యాప్తు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో మహేశ్‌కు న్యాయమూర్తి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ మహేశ్‌ల పర్యవేక్షణలో సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన ఎస్సై వెంకటకృష్ణ, సీఐ జగదీశ్, సుల్తానాబాద్ సీడీవోలు శ్రీనివాస్, సందీప్, లైసన్ అధికారి హెచ్‌సీ కోటేశ్వర్‌రావులను సీపీ రెమారాజేశ్వరి అభినందించారు.

'పెనాల్టీ రద్దు చేయండి'

యైటింక్లయిన్‌కాలనీ: సివిల్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్టు కార్మికులకు వేస్తున్న పెనాల్టీని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యం బాగాలేక, అత్యవసర సమయంలో ఒక్కరోజు విధులకు హాజరుకాలేకపోయినా ఆరోజు వేతనం చెల్లించకపోగా వారి మాస్టర్ల నుంచి పెనాల్టీ పేరుతో దాదాపు రూ.600 వరకు కట్ చేయడం సరికాదన్నారు. సింగరేణి కార్మికులకు లేని నిబంధన వీరికి ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, పెనాల్టీ వేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సీకేఎస్ సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు భూమయ్య, వెంకన్న, కార్యదర్శి ఉల్లి మొగిలి, లక్ష్మీనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం గోదావరిఖనిలోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన వార్షిక ప్లానింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలు, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అవసరమయ్యే యంత్రాలు, పరికరాలు, కావాల్సిన విడిభాగాలు తదితర అంశాలపై చర్చించారు. ప్లానింగ్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, ప్రాజెక్టు ఇంజినీర్ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు రామారావు, చక్రవర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

విజిలెన్స్ అవగాహన వాల్ పోస్టర్‌ను ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. తన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, సివిల్ డీజీఎం ధనుంజయ, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు తెలంగాణ జట్లు

- 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఢిల్లీలో పోటీలు
- జాబితా ప్రకటించిన అనంతరెడ్డి, జనార్ధన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: జాతీయస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కదారి అనంతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నెల 19, 20 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీలో ఈ నెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

పురుషుల జట్టు

ఎన్.డింజిల్ (ఆదిలాబాద్, 55కేజీ లోపు), పి.శివాజీ(యాదాద్రి, 60కేజీలోపు), టి.శివకుమార్ (యాదాద్రి, 66కేజీలోపు), అనాస్‌ఖాన్(హైదరాబాద్, 73కేజీలోపు), టి.రోహన్ సింగ్ (వరంగల్, 81కేజీలోపు), టి.భువనేశ్వర్ సింగ్ (వరంగల్, 90కేజీ లోపు),షేక్ ఫైజాన్ (హైదరాబాద్, 100కేజీ లోపు), టి.సాయిపుత్రనాథ్ (హైదరాబాద్, 100కేజీ పైన).

మహిళల జట్టు

కె.దీపిక (వరంగల్, 44కేజీ లోపు), కె.అనూష (వరంగల్, 48కేజీ లోపు), ఆర్.చాందిని (ఆదిలాబాద్, 52కేజీలోపు), బి.స్పందన (వరంగల్, 57కేజీ లోపు), పి.వసుధ (ఆదిలాబాద్, 63కేజీలోపు), నరేన్‌సుల్తానా (హైదరాబాద్, 70కేజీలోపు), హుమేరాబేగం (హైదరాబాద్, 78కేజీ లోపు), డి.నక్షత్ర (78కేజీ పై).

అధికారుల సంఘం కార్యవర్గం ఎన్నిక



రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జీఎం సుధాకర్‌రావు, అధికారుల సంఘం అపెక్స్ సభ్యుడు చంద్రమౌళి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఓసీపీ–1 ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు, సెక్రటరీగా జి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కమలాకర్, ట్రెజరీగా సునీల్ ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు రాధాకృష్ణకు జీఎం శుభాకాంక్షలు తెలిపారు. అధికారుల ఐక్యతకు, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రాధాకృష్ణ తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సివిల్ డీజీఎం పద్మరాజు, డీవైపీఎం రవీందర్ రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ డీవైపీఎం మారుతి పాల్గొన్నారు.

వరద బాధితులకు లయన్స్ క్లబ్ చేయూత



మంథని: భారీ వర్షాల కారణంగా గోదావరి తీర ప్రాంతాల్లో వరదలు వచ్చి, నష్టపోయిన కుటుంబాలకు లయన్స్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చిందని జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి అన్నారు. గురువారం మంథనిలోని ఓ గార్డెన్‌లో మంథనితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వరదల వల్ల నష్టపోయిన వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 320జీ డిస్ట్రిక్ట్ జిల్లా పరిధిలో రూ.8 లక్షల విలువ చేసే సామగ్రి అందజేసినట్లు పేర్కొన్నారు. పూర్వ గవర్నర్ ఆర్.నారాయణరెడ్డి, ఉప జిల్లా గవర్నర్లు ఎన్‌వీ రావు, కోదండరాం, జిల్లా కేబినెట్ కార్యదర్శి రమణారెడ్డి, అదనపు కార్యదర్శులు బుర్ర మధుసూదన్‌రెడ్డి, భద్రేశం, జయపాల్‌రెడ్డి, మంథని క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేశ్, కోశాధికారి మండల మల్లరెడ్డి, డైరెక్టర్లు, సభ్యులున్నారు.

వేతన ఒప్పంద ఏరియర్స్ చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు రావాల్సిన 11వ వేతన ఒప్పంద ఏరియర్స్‌ను యాజమాన్యం వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియా మాదిరిగా సెప్టెంబర్‌లో రావాల్సిసిన ఏరియర్స్‌పై ఇప్పటివరకు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటా ఊసే ఎత్తడం లేదన్నారు. దీనిపై కార్మికులు ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా ఏర్పడితే పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్‌ను యాజమాన్యమే చెల్లించేలా చూస్తామని పేర్కొన్నారు. మారుపేర్ల మార్పు ఆరు నెలల్లో అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిలో నాలుగు బ్లాకులు ప్రైవేటుపరం అవుతుంటే ప్రధాని మోదీని ప్రశ్నించకపోవడంలో మర్మమేమిటో కార్మికులు ఆలోచించాలన్నారు. కనీసం సురక్షితమైన మంచినీటిని కార్మిక కుటుంబాలకు అందించలేని పరిస్థితుల్లో యాజమాన్యం ఉందని విమర్శించారు. నాయకులు నరసింహారెడ్డి, సదానందం, ధర్మపురి, వికాస్‌కుమార్ యాదవ్, ఎట్టెం కృష్ణ, సమ్మయ్య, స్వప్న, మహేశ్‌బాబు తదితరులున్నారు.

ట్రినిటీ కళాశాలలో 'శ్రావణోత్సవ్'



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీలో గురువారం శ్రావణోత్సవ్ పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ప్రారంభించారు. అష్టలక్ష్మి దేవతకు విద్యాసంస్థల అధినేత ప్రశాంత్‌రెడ్డి, మమతారెడ్డి పూజలు చేశారు. వచ్చిందోయ్.. వచ్చిందోయ్ శ్రావణమాసం వచ్చిదంటూ విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీతూరెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.